ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

సోమవారం 27 అక్టోబరు 2025



నేడు కలెక్టరేట్ పీజీఆర్ఎస్ రద్దు

పార్వతీపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను రద్దు చేసినట్టు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలన్నారు. వినతిపత్రాలతో సుదూర ప్రాంతాల నుంచి ఎవరూ కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు. మండల కేంద్రాల్లో ఉన్న అధికారులు ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు.

తుఫాన్ ముప్పు

- జిల్లాపై 'మొంథా' ప్రభావం
- మారిన వాతావరణం.. పలుచోట్ల వర్షాలు
- నేటి నుంచి మరింత తీవ్రతరం
- పంటల పరిస్థితిపై రైతుల్లో ఆందోళన



తోటపల్లి స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు వరద నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

నాగావళికి వరద

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలోకి పైప్రాంతాల నుంచి 3,600 క్యూసెక్కుల వరద చేరింది. దీంతో ఆదివారం స్పిల్‌వే గేట్లు నుంచి దిగువకు 5,600 క్యూసెక్కులను విడుదల చేశారు. ప్రధాన కాలువల నుంచి 500 క్యూసెక్కులను సాగునీటి కోసం విడుదల చేశారు. కుడి ప్రధాన కాలువ నుంచి సాగునీటి సరఫరాను నిలిపేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 103.56 మీటర్ల మేర నీటి నిల్వ ఉంది.



వీరఘట్టం: చిట్టిపుడివలసలో కోత దశలో ఉన్న వరి పంట

పార్వతీపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి)

జిల్లాకు 'మొంథా' తుఫాన్ ముప్పు ముంచుకొస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఆదివారం మన్యంలో వాతావరణం మారింది. ఆకాశం మేఘావృతమవగా.. అక్కడక్కడా చిరుజల్లులు పడ్డాయి. మరికొన్నిచోట్ల గాలులతో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సోమ, మంగళవారాల్లో తుఫాన్ మరింత బలపడనుందని, ఉరుములు, మెరుపులతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో జిల్లాలో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతి కందొచ్చిన పంటలను నష్టపోయే ప్రమాదం ఉందని వారు టెన్షన్ పడుతున్నారు. మరోవైపు జిల్లా అధికార యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. జిల్లాలో 15 మండలాల్లో మండలస్థాయిలో ఎంపీడీవోల పర్యవేక్షణలో మండల స్థాయి కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. ఇవి ఈ నెల 30 వరకు 24

(మిగతా 8వ పేజీలో..)



గరుగుబిల్లి: శివ్వాంలో కురుస్తున్న వర్షం

పాఠశాలలు, కళాశాలలకు సెలవు..

తుఫాన్ నేపథ్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం రాత్రి తెలిపారు. ఉప విద్యా శాఖాధికారులు, ఎంఈవోలు మండలాల పరిధిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వారితో పాటు హెచ్ఎంలు కూడా 24 గంటలూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఎప్పటికప్పుడు సమీక్షించాలి: మంత్రి సంధ్యారాణి



పార్వతీపురం/సాలూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా' తుఫాన్ ముప్పు ముంచుకొస్తున్న నేపథ్యంలో అధికారులను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అప్రమత్తం చేశారు. ఆదివారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడారు. సోమవారం జరిగే గ్రీవెన్స్‌ను రద్దు చేయాలన్నారు. అన్ని మండలాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. సహాయక చర్యలను పర్యవేక్షించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని వెల్లడించారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున వైద్య సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రత దష్ట్యా అవసరమైతే విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలన్నారు. వాగులు వంకలు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున ప్రజలు ఇళ్ల వద్దే ఉండాలన్నారు. రైతులు, మత్స్యకారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

యంత్రాంగం సిద్ధంగా ఉండాలి..

-జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు



పార్వతీపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఆదివారం కలెక్టర్, ఎస్పీలతో, ఇతర శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నేటి నుంచి 29 వరకు తీవ్ర గాలులతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎక్కడా ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్డీ ఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే తీర ప్రాంతాలకు చేరుకోవాలని సూచించారు. జలాశయాల్లో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించి అందుకనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



మొంథా' తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని మోస్తారు నుంచి భారీ వర్షాలు కు రిసే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' భారీ వర్షాల వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు సంభవించకుండా చూడాలి. ముందుగా గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలి. జిల్లా అధికారులు శాఖలవారీగా సమన్వయంతో విధులు నిర్వహించాలి. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు. లోతట్టు, నదీపరివాహక ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలి. నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా చూడాలి. శిథిల భవనాల్లో ఎవరూ ఉండరాదు. విద్యుత్, ఆర్అండ్‌బీ, పంచాయతీ, వైద్య ఆరోగ్యం, రెవెన్యూ, పౌరసరఫరా తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలి. పునరావాస కేంద్రాల గుర్తింపుతో పాటు ఆహారం ఏర్పాట్లలో తహసీల్దార్లు సిద్ధంగా ఉండాలి.' అని తెలిపారు.

కదలవు.. వదలవు!

- సోమినాయుడువలసలోనే గజరాజులు

కొమరాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలాన్ని గజరాజులు వీడడం లేదు. గత రెండు రోజులుగా సోమినాయుడు వలసలోనే సంచరిస్తున్న ఏనుగులు ఆదివారం కూడా ఆ గ్రామ పరిసరాల్లోనే హల్‌చల్ చేశాయి. చేతికందొచ్చిన టమాటా, పత్తి, అరటి, వరి పంటలను ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రాత్రి వేళల్లో అర్తాం కొండల్లో ఉంటున్న ఏనుగులు సాయంత్రం వేళల్లో పంట పొలాల్లోకి చేరుకుని నాశనం చేస్తున్నాయి. కాగా పంట నష్టం నమో దుకు కూడా అధికారులు రాకపోవడంతో వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మరోవైపు తుఫాన్ గుబులు అన్నదాతలను వెంటాడుతోంది. ఏదేమైనా తక్షణమే ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించాలని ఆ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.



వరి పొలంలో సంచరిస్తున్న ఏనుగులు

శివ పూజకు ఆలయాలు సిద్ధం

- నేడు కార్తీకమాస తొలి సోమవారం



సాలూరు రూరల్/గరుగుబిల్లి, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శైవక్షేత్రాలు కార్తీక తొలి సోమవారానికి ముస్తాబయ్యాయి. శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజు కావడంతో భక్తులు విశేష అర్చనలు, పంచామృ తాభిషేకాలు, రుద్రాభిషేకాలు చేపట్టనున్నారు. ప్రత్యేక పూజలు, దీపారాధనలు కూడా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీ దృష్ట్యా మన్యంలోని ప్రముఖ శైవ క్షేత్రాలు, గుహాలయాల్లో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సాలూరు, పాచింపెంటలో ఉన్న పంచముఖేశ్వర ఆలయం, గుమ్మలకొండ, మంచాడవలస వద్ద గుహాలయాలు, తాడూరు వద్ద ఉన్న నిలువు నామాల శివలింగ దర్శనానికి భక్తులు బారులుదీరనున్నారు. సాలూరు పట్టణ సరిహద్దులో రామభద్రపురం మండలం కొట్టక్కి వద్ద ఉన్న భీమలింగేశ్వర ఆలయానికి భక్తజనం పోటెత్తనున్నారు. మక్కువ మండలంలో శాంతేశ్వరం, ములక్కాయవలస వద్ద శివాలయాల్లో పూజలకు సర్వం సిద్ధం చేశారు. గరుగుబిల్లి మండలంలో నాగావళి నదీ తీరానికి ఆనుకుని ఉన్న శివాలయాలకు అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఎవరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

చేయి చేయి కలిపారు.. దారి ఏర్పాటు చేశారు

కొమరాడ: అకాల వర్షాలకు నాగావళి, జంఝావతి నదులు ఉప్పొంగడంతో కొమరాడ మండలంలో కోటిపాం నుంచి గుంప సోమేశ్వర దేవాలయానికి వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. దీంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. కాగా కార్తీక తొలి సోమవారం నేపథ్యంలో భక్తజనం భారీగా జనం తరలిరానున్నారు. ఈ క్రమంలో ఆదివారం దేవదాయశాఖ సూచనలతో కోటిపాం గ్రామ ప్రజలు చేయి చేయి కలిపి.. నది మధ్యలో ఉన్న బీటీ రోడ్డు గట్టు వెంబడి ఇసుక బస్తాలు వేసి తాత్కాలికంగా దారి ఏర్పాటు చేశారు. భక్తులు నదీ ప్రవాహాన్ని గమనించి ఆలయానికి చేరుకోవాలని అధికారులు సూచించారు.



గుంప సోమేశ్వర దేవాలయానికి దారి ఏర్పాటు చేసుకుంటున్న దృశ్యం

అధ్వానంగా వీధి దీపాల నిర్వహణ

8లో

- ఇదీ జిల్లాకేంద్రంలో పరిస్థితి
- పెదవి విరుస్తున్న పట్టణవాసులు



పాలకొండలో ట్రాఫిక్‌జాం

- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

8లో



పాలకొండలో నిలిచిన భారీ వాహనం

బిక్కుబిక్కుమని..

- శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయ భవనాలు
- పలు శాఖలకు నిలువ నీడ కరువు
- భయాందోళనలో ఉద్యోగులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

పాలకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పాలకొండలో ఇందిరానగర్ కాలనీలో ఉన్న సమీకృత ప్రభుత్వ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. దీంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఆయా కార్యాలయాలకు వచ్చేవారు సైతం తీవ్ర భయాందోళన చెందుతున్నారు. వాస్తవంగా 2011-12లో పాలకొండ ఆర్డీవోగా పనిచేసిన సాలూరు వెంకటేశ్వరరావు ఇందిరానగర్ కాలనీలో బీసీ బాలుర వసతిగృహ సముదాయానికి మరమ్మతులు చేపట్టి సమీకృత ప్రభుత్వ కార్యాలయ భవనంగా మార్చారు. సుమారు 14గా పైగా ప్రభుత్వ కార్యాలయాలను ఒకేచోట ఉండేలా చొరవ చూపారు. దీంతో ప్రభుత్వానికి కొంతమేర అద్దె ఖర్చులు తగ్గినట్టు అయింది. కార్యాలయాలు ఉండడంతో వివిధ పనులు మీద వచ్చే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేది. అయితే ఆ భవనాలన్నీ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోగా.. విష సర్పాల బెడద కూడా వెంటాడుతోంది.



డీఎల్‌పీవో కార్యాలయం ఇలా..

ఇదీ పరిస్థితి...

సమీకృత ప్రభుత్వ కార్యాలయ భవనంలో డివిజనల్ పంచాయతీరాజ్, మత్స్య, కార్మిక శాఖలు, సబ్ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రం, హౌసింగ్ డీఈ, ఏఈ, డీపీఆర్‌వో, బీసీ, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయాలు, గ్రామ కచేరీ, సచివాలయం, ఆధార్ సేవా కేంద్రం తదితర కార్యాల యాలు ఉండేవి. అయితే భవన సముదాయం పూర్తిగా

(మిగతా 8వ పేజీలో...)



కూలే స్థితిలో వార్డు సచివాలయ భవన సముదాయం

రేపు జిల్లాకు ఎన్‌హెచ్ఆర్‌సీ బృందం

- కురుపాం ఘటనపై విచారణ

పార్వతీపురం/కురుపాం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) సభ్యుల బృందం రేపు జిల్లాలో పర్యటించనుంది. మంగళవారం కురుపాం గురుకుల పాఠశాలను పరిశీలించి.. విచారణ చేపట్టనున్నారు. కొద్ది రోజుల కిందట పచ్చకామెర్లతో ఆ పాఠశాలకు చెందిన ఇద్దరు బాలికలు మృతి చెందిన విషయం తెలిసిందే. మరికొంతమంది గిరిజన విద్యార్థులు జాండీస్ లక్షణాలతో పార్వతీపురం జిల్లాకేంద్రాసుపత్రి, విశాఖ కేజీహెచ్‌లో చేరి వైద్య సేవలు పొందారు. వారిలో చాలామంది డిశ్చార్జి అయిపోయారు. అయితే కురుపాం ఘటనపై అరకు ఎంపీ తనూజారాణి, మాజీ డిప్యూటీ సీఎంలు పుష్పశ్రీవాణి, పీడిక రాజన్నదొర జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో 27న ఎన్‌హెచ్ ఆర్‌సీ బృంద సభ్యులు విశాఖ చేరుకుంటారు. 28న అక్కడ నుంచి పార్వతీపురం వస్తారు. 31వ తేదీ వరకు విచారణ కొనసాగిస్తారు. బాలికల మృతి , అనారోగ్యానికి గురైన వారికి అందిన వైద్య సేవలపై ఆరా తీయనున్నారు. ఆసుపత్రులు, విద్యార్థినుల ఇళ్లకు వెళ్లి విచారణ చేయనున్నట్లు తెలిసింది. దీనిపై గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయశాంతిని వివరణ కోరగా.. ఎన్‌హెచ్ఆర్‌సీ బృంద సభ్యుల జిల్లా పర్యటనకు షెడ్యూల్ ఖరారైందన్నారు.

వ్యాన్, బైక్ ఢీ

- పేలిన ఆయిల్ ట్యాంకు
- రెండు వాహనాలు దగ్ధం
- ఒకరికి గాయాలు

7లో

ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో పర్యాటకుల సందడి

8లో

పారాది కాజ్‌వే పైకి వరద



7లో

ఈ-క్రాప్ నమోదుకు గడువు పెంపు

- ఈ నెల 30 వరకు అవకాశం
- నిబంధనల మార్పుతో జాప్యం

గరుగుబిల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదుకు అధికారులు గడువు పొడిగించారు. ఈ నెల 30 వరకు అవకాశం ఇచ్చారు. వాస్త వంగా ఈనెల 25తో నమోదు ప్రక్రియ ముగిసింది. కాగా కొన్ని మండ లాలు వెనుకబడి ఉండటంతో రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ సమయం పొడిగించారు. 2025 ఖరీఫ్‌కు గాను జిల్లాలో 1,67,843 ఎకరాల్లో ఈ-క్రాప్ నిర్వహించాల్సి ఉంది. 8,290 ఎకరాల్లో అరటి, 15,634 ఎకరాల్లో పామాయిల్, 14,322 ఎకరాల్లో పత్తికి సంబంధించి ఈ-క్రాప్ నిర్వహించాల్సి ఉంది. గత ఏడాది 1,75,463 ఎకరాలకు పైగా ఈ-క్రాప్ నిర్వహించారు. ఈ ఏడాది జూలై నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభమైంది.

ఇదీ పరిస్థితి..

గత వైసీపీ ప్రభుత్వ హయంలో 0.25 సెంట్లు పైబడిన వారికే ఈ-క్రాప్ నిర్వహించేవారు. మరో వైపులో నమోదులో పలు అవకతవకలు నెల కొన్నాయి. పలు రకాల పంటలను మార్పు చేసి నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం అవకతవకలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టింది. రైతులు సాగు చేస్తున్న ప్రతి సెంటు ప్రాంతాన్ని విధిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సచివాలయాల సిబ్బంది, మండల వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలోనే పరిశీలించి రైతులు సాగు చేస్తున్న పంటలను నమోదు చేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో సిగ్నల్ సమస్యతో ఈ పక్రియ నిర్వహణ కష్టతరంగా మారింది. అదేవిధంగా రెవెన్యూ గ్రామాల పరిధిలో



రావుపల్లిలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

(మిగతా 8వ పేజీలో...)

స్వయం ఉపాధితో అభివృద్ధి చెందండి



డెయిరీ స్టాక్ పాయింట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి తదితరులు

వేపాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని యువత స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. వేపాడలో విశాఖ డెయిరీ సహకారంతో ఏర్పాటుచేసిన కంటైనర్ పార్లర్, స్టాక్ పాయింట్లను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. డెయిరీ డైరెక్టర్లు, సీవోవో, మేనేజర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. బల్లంకి గ్రామంలో విశాఖ డెయిరీ సహకారంతో ఏర్పాటుచేసిన 15 తాగునీటి బోర్లను ప్రారంభించారు.

విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్షలు

కొత్తవలస, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సుపథ సేవా సంఘం, జగద్గురు పీఠం సంయుక్తంగా ఆదివారం కొత్తవలస జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొని, విజేతలకు బహుమతులను అందజేశారు. సుపథ సేవాసంఘం వ్యవస్థాపకుడు యూవీఏఎస్ రాజు, ఎంపీపీ నీలంశెటి గోపెమ్మ, కొత్తవలస సర్పంచ్ రామస్వామి, ఎంఈవో బండారు శ్రీనివాసరావు, కొత్తవలస మాజీ సర్పంచ్ గొరపల్లి రాము పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు నిత్యాన్నదానం ప్రారంభం

కొత్తవలస, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కొత్తవలస మరిడిమాంబ గుడి వద్ద మణికంఠ సేవా పీఠం వ్యవస్థాపకుడు కంచిపాటి వేణు ఏర్పాటుచేసిన అయ్యప్ప దీక్షాదారుల నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి అప్పారావు, పీవీ రత్నాజీ, కోళ్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

గరివిడి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు. గరివిడి పట్టణంలోని బంగారమ్మ కాలనీలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, దళిత నేతలు పాల్గొన్నారు.

నేటి పీజీఆర్ఎస్ రద్దు

కొత్తవలస, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కొత్తవలస తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను తుపాన్ కారణంగా రద్దు చేసినట్టు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

రాజాంలో రారవే సమావేశం

రాజాం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత రచయిత రౌతు వాసుదేవరావు రచించిన 'తూర్పు కొండల్లో మెరిసిన మేరింగి' అనే నవల పది దశాబ్దాల మేరింగి గ్రామ సామాజిక చరిత్ర అని డా.ఆల్తి మోహన్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించిన రాజాం రచయితల వేదిక సమావేశంలో ఆయన పాల్గొని, ఆ నవలపై ప్రసంగించారు. అనంతరం ఆయన తోపాటు నవల రచయిత రౌతు వాసుదేవరావు, పిల్లా తిరుపతిరావులను వేదిక సభ్యులు సన్మానించారు. రౌతు గణపతిరావునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వేదిక నిర్వాహకుడు రంగనాథం పాల్గొన్నారు.

కళాశాల సమస్యలు పరిష్కరిస్తాం

భోగాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమస్యలను పరిష్కరిస్తామని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ చీకటి సుహాసిని, కళాశాల అధ్యాపకుడు శ్రీనివాసరావు ఆదివారం పోలిపల్లి గ్రామంలో బంగార్రాజును కలిశారు. డిగ్రీ కళాశాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆయన స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

స్వామివారిని తాకిన సూర్యకిరణాలు

రాజాం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మునిసిపాల్టీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో ఉమానీలకంఠేశ్వర ఆలయంలో స్వామివారిని ప్రతిరోజూ సూర్యకిరణాలు తాకుతున్నాయని ఆలయ అర్చకుడు దండేలా సూర్యగణపతి తెలిపారు. ఆదివారం కూడా స్వామివారిని సూర్యకిరణాలు తాకాయి.



శివలింగాన్ని తాకుతున్న సూర్యకిరణాలు

నిధులున్నా అభివృద్ధి శూన్యం

- నెల్లిమర్ల నగర పంచాయతీలో పడకేసిన పనులు
- అధికారులపై గుర్రుగా ఉన్న ప్రజలు



నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయం

నెల్లిమర్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీలో అభివృద్ధికి కోట్లాది రూపాయలు నిధులున్నా అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధి కుంటుపడుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వేగంగా జరగాల్సిన పనులు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆలస్యమవుతున్నాయని వాపోతున్నారు. గత ప్రభుత్వం నిర్వాకంతో నెల్లిమర్ల నగర పంచాయతీలో అభివృద్ధి పనులు పడకేశాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాల్లో అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ నిధులు రూ.2 కోట్లు విడుదల చేసింది. వీటిలో 20 వార్డుల్లో సుమారు 40 పనులు చేయాల్సి ఉంది. కానీ ఎక్కడా అభివృద్ధి జాడ కానరావడం లేదు. నగర పంచాయతీకి నిధులు రావడంతో జరజాపుపేటలో 14, నెల్లిమర్లలో 20 పనులు చేసేందుకు అధికారులు గుర్తించారు. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించి టెండర్ల ప్రక్రియ పూర్తిచేశారు. నెల్లిమర్లలోని కీర్తి వీధిలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించారు. కానీ జరజాపుపేటలో ఒక్కటీ ప్రారంభించలేదు. కేవలం 7 పనులకే ఒప్పందం జరిగింది. ఇంకా జాప్యం జరిగితే నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. చేసిన వాటికి సకాలంలో బిల్లులు చెల్లించక మిగతావి ఆగిపోయాయి. గుత్తేదారులు కొత్త వాటి కోసం ముందుకు రావడం లేదు. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఓపక్క ఇంజనీరింగ్ సిబ్బంది కొరత వేధిస్తోంది. పూర్తిస్థాయిలో ఏఈ లేకపోవడంతో వార్డు సచివాలయం ఇంజనీరింగ్ కార్యదర్శులు తూతూ మంత్రంగా పనులు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీనికితోడు ఇక్కడ విధులు నిర్వహించిన సిబ్బంది బదిలీపై వెళ్లడంతో సమస్య తీవ్రమై ఇబ్బందులు పెరిగాయి.

అభివృద్ధికి ఆటంకం కలగకుండా చర్యలు..

ఇటీవల విధుల్లో చేరాను. నగర పంచాయతీ అభివృద్ధికి ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటాను. నిధులు ఉన్నమాట వాస్తవమే. నగర పంచాయతీలో అభివృద్ధి పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నాం. నగరవాసులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- జయరామ్, కమిషనర్, నెల్లిమర్ల నగర పంచాయతీ

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

- తుఫాన్ నేపథ్యంలో అధికారుల ముందస్తు చర్యలు

విజయనగరం టౌన్, అక్టోబరు(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పట్ల నగరవాసులంతా అప్రమత్తంగా ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. నగరంలోని పునరావాస కేంద్రాలను ఆయన ఆదివారం పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో మంగళ వీధి, గాడీఖానా ప్రాంతాలలోని 55 కుటుంబాలు లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉన్నట్లు గుర్తించామని, వీరికి ఆయా ప్రాంతాలలోని పాఠశాలల్లో పునరావాసం ఏర్పాటు చేశామని చెప్పారు. అన్ని సచివాలయాల్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూస్తున్నామని, పారిశుధ్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. తుఫాన్ వల్ల నగరంవాసులకు ఎటువంటి ఇబ్బంది వచ్చినా నేరుగా 9849906486 నెంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.

● గజపతినగరం: తుఫాన్ పట్ల గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.రత్నకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చంపావతి, ఏడొంపుల గెడ్డ నది పరివాహక ప్రాంతాల గ్రామాల ప్రజలను సురక్ష ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సూచించారు. టోల్‌ఫ్రీ నెంబర్ 299984ను వినియోగించుకోవాలన్నారు. ● చీపురుపల్లి: తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ డి.ధర్మరాజు సూచించారు. ఆదివారం ఆయన జి.ములగాం పెద్దచెరువును పరిశీలించారు. గట్టు పటిష్టతపై ఆరా తీశారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ అలమండ నరసింహమూర్తి, టీడీపీ నాయకులు గంట్యాడ సత్యానారాయణ, గడే సన్యాసప్పలనాయుడు ఉన్నారు.



విజయనగరం టౌన్: పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

● లక్కవరపుకోట: తుఫాన్ నేపథ్యంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎస్.అప్పారావు ముందస్తు చర్యలకు ఉపక్రమించారు. ప్రజలకు పునరావాసం ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ నెంబరు 9492749211 ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ తెలిపారు. ● వేపాడ: తుఫాన్ నేపథ్యంలో పశువులను సురక్షితంగా ఉంచేందుకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి కోరాడ గాయత్రీ సూచించారు. ఎత్తయిన ప్రదేశాలలో షెల్టర్లను ఏర్పాటు చేసుకోవాలని, మేత, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ● సంతకవిటి: తుఫాన్ నేపథ్యంలో తహసీల్దార్ సుదర్శనరావు మండలంలోని నాగావళి నది తీర ప్రాంత ప్రజలను ఆదివారం అప్రమత్తం చేశారు. నదీ తీర గ్రామాల ప్రజలు నదుల్లోకి స్నానాలకు వెళ్లొద్దని హెచ్చరించారు. కొత్తూరు రామచంద్రపురంలో పర్యటించి ప్రజలకు సూచనలు చేశారు. ● రాజాం: తుఫాన్ నేపథ్యంలో ఉద్యాన పంటల రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారిణి సీహెచ్ ఉమామహేశ్వరి వీపీఏ పార్వతీ సూచించారు. ఆదివారం ఆమె మండలంలోని కొన్ని గ్రామాల్లో పర్యటించి, పంటల రక్షణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు. ● తుఫాన్ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.రాజశేఖర్, ఎంపీడీవో జె.ఆనందరావులు ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. మండల స్థాయి అధికారులతో పాటు, వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు సెలవులు మానుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు.

తాటిపూడి రిజర్వాయర్ పరిశీలన

గంట్యాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయర్‌ను జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. రిజర్వాయర్‌లోకి వరదనీరు అధికంగా రావడంతో ఇరిగేషన్ అధికారులు గేట్ల ద్వారా కిందకు విడిచిపెట్టారు. ఈనేపథ్యంలో రిజర్వాయర్ పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఆయనతోపాటు గంట్యాడ జడ్పీటీసీ సభ్యుడు వర్రి నర్సింహమూర్తి, వైసీపీ నాయకుడు జైహింద్ కుమార్ ఉన్నారు.

పొంచిఉన్న ముంపు ప్రమాదం

బొబ్బిలి: తుఫాన్ నేపథ్యంలో రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీను ఆదేశించారు. బొబ్బిలిలోని పాతబొబ్బిలి ఎస్సీ కాలనీకి బైరిసాగరం బ్యాక్ వాటర్‌తో ముంపు ప్రమాదం పొంచిఉందని, 14వ వార్డులోని అప్పయ్యపేట పక్కనే గల పంటకాలువ నుంచి వరదనీరు చేరే అవకాశముందని పేర్కొన్నారు. ఈ మేరకు తహసీల్దారు వాయిస్‌మెసేజ్ ద్వారా ప్రజలను అప్రమత్తంచేశారు. ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ఉన్నవారిని తక్షణం ఖాళీ చేయిస్తున్నట్లు తెలిపారు. కాగా తుఫాన్ దృష్ట్యా రిజర్వాయర్లు సాధారణ సామర్థ్యానికి 0.6 మీటర్ల దిగువకు నీటి నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందని బొబ్బిలిఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీరు అప్పారావు తెలిపారు.

● బొబ్బిలి రూరల్: తుఫాన్ నేపథ్యంలో రానున్న మూడురోజులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీను సూచించారు. ఆదివారం గొర్లెసీతారాంపురం, నారాయణప్పవలస వద్ద గల కంచరగెడ్డ జలాశయం పరిధిలోగల లోతట్టు ప్రాంతాల్లోని బైరిసాగరం, అప్పయ్యపేట ఎస్సీ కాలనీ, తదితర ప్రాంతాలను పరిశీలించారు. అవసరమైన వారు 8333813258కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు.

పెట్టుబడులకు వేదికగా విశాఖ

- ఎంపీ అప్పలనాయుడు

న్యూఢిల్లీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో విశాఖ పెట్టుబడులకు వేదికగా మారబోతోందని ఎంపీ అప్పలనాయుడు తెలిపారు. ఢిల్లీలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నంలో నవంబరు 14, 15 తేదీలో జరిగే పారిశ్రామిక సదస్సు. పెట్టుబడులు తెచ్చేందుకు, వాటికి సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకునేందుకు వేదిక కాబోతుందని తెలిపారు. అమరావతి, విశాఖపట్నం ఒకేలా అభివృద్ధి చెందాలని సీఎం చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్టు వివరించారు. అలాగే, ఐటీ మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటించి పెట్టుబడులకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. జగన్ పాలనలో సంస్థలన్నీ తరలి వెళ్లిపోయాయని గుర్తు చేశారు. రాష్ట్రానికి కంపెనీలు రాకుండా అడ్డుకునేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

గత ప్రభుత్వంలోనే కల్తీ మద్యం విక్రయాలు



మద్యం సీసాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళా

గరివిడి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని విక్రయించింది గత ప్రభుత్వమేనని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. గరివిడి పట్టణంలో ఉన్న మద్యం దుకాణాన్ని ఆయన ఆదివారం తనిఖీ చేశారు. మద్యాన్ని ఎంఆర్‌పీకి అమ్ముతున్నదీ లేనిదీ ఆరా తీశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం కల్తీ మద్యాన్ని విక్రయించి రాష్ట్రంలో వేలాది మంది ప్రాణాలను పోవడానికి కారణమయ్యిందన్నారు. ప్రస్తుతం ఎటువంటి అక్రమాలు, అవినీతి లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారని ఆయన అన్నారు. టీడీపీ నాయకులు పైల బలరాం, బలగం వెంకటరావు, సారిపాక సురేష్‌కుమార్, రెడ్డి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

చంద్రంపేట సమస్యల పరిష్కారానికి కృషి

నెల్లిమర్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చంద్రంపేట గ్రామంలో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. ఆ గ్రామానికి చెందిన పలువురు ఆదివారం ఆమెను కలిశారు. గ్రామ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి కొత్త భవనం ఉన్నా శిథిలావస్థకు చేరుకున్న పాత భవనంలోనే కొనసాగిస్తున్నారని తెలిపారు. దీనిపై ఆమె ఐసీడీఎస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి.. వారం రోజుల్లోగా అంగన్‌వాడీ కేంద్రాన్ని కొత్త భవనంలోకి మార్పుచేయాలని ఆదేశించారు. అలాగే తాగునీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో శిథిల స్థితికి చేరుకున్న విద్యుత్ స్తంభాలను తక్షణమే మార్పు చేయాలని ఆ శాఖ డీఈకి ఆదేశించారు.



ఎమ్మెల్యేకు సమస్యలను వివరిస్తున్న గ్రామస్థులు

పీపీపీ విధానంపై దుష్ప్రచారం తగదు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ భాగస్వామ్యంగా ఉండే పీపీపీ విధానంలో వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తున్నదని, దీనిపై వైసీపీ దుష్ప్రచారం చేయడం తగదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావనీలు అన్నారు. ఆదివారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పీపీపీ విధానంలో వైద్య కళాశాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తవుతాయనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానాన్ని వెలుగులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రైవేటీకరణ, పీపీపీ విధానానికి తేడా తెలియకుండా వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుసుమంచి సుబ్బారావు, కోటగిరి నారాయణరావు, పతివాడ రాజేష్, గిరిబాబుతో పాటు జిల్లా పదాధికారులు పాల్గొన్నారు.

ప్లానింగ్ సెక్రటరీల నూతన కార్యవర్గం



ప్లానింగ్ సెక్రటరీల టెక్నికల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం

విజయనగరం టౌన్/ విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లా, నగరపాలక సంస్థ, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న ప్లానింగ్ సెక్రటరీ టెక్నికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక నగరంలోని వీఎస్సార్ కాలనీలో ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా పొట్నూరు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మురుముల్ల రాజేష్, మహిళా అధ్యక్షురాలిగా ఎల్లంకి లక్ష్మీ ప్రియాంక, ఉపాధ్యక్షులుగా గురజాడ అశోక్ కుమార్, ఉంటి చైతన్యసాయి, కోశాధికారిగా వెత్స మణికంఠ, సహాయ కోశాధికారిగా పాలభక్తసింగ్, సహాయ కార్యదర్శులు ముఖాల మోహన్, త్రిపురాన సందీప్ చంద్ర, సబ్బవరపు నవీన్‌కుమార్, బొడ్డాన లేఖావళి, రెడ్డి మహేష్, వాకాడ రమేష్, సభ్యులుగా వారాది ఆనందకుమార్, పొన్నమండ సందీప్‌బాబు, లింగం వంశీప్రసాద్, లెంకా మోహనరావు, యాగిరెడ్డి శివున్నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు అధ్యక్షుడు పొట్నూరి శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అశోక్‌కుమార్, సందీప్ చంద్ర, చైతన్యసాయి తదితరులు పాల్గొన్నారు.

పారాది కాజ్‌వేపైకి వరద

- నిలిచిన రాకపోకలు
- వాహనాలను దారి మళ్లించాలని ఆర్డీవో ఆదేశం



కాజ్‌వేను పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారాది వద్ద వేగావతి నదిపై తాత్కాలికంగా నిర్మించిన కాజ్‌వే మీదుగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు ఆదివారం కాజ్‌వేపై వరదనీటి ఉధృతిని తహసీల్దార్ శ్రీనుతో కలిసి పరిశీలించారు. రానున్న రెండు రోజులపాటు మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో కాజ్‌వేపై భారీగా వరదనీరు వచ్చి చేరితే విశాఖ-రాయగడల మధ్య ప్రయాణించే వాహనాలను దారి మళ్లించాలని పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. రామభద్రపురం నుంచి రాజాం మీదుగా రాయగడ వైపుగా వాహనాలు వెళ్లాల్సి ఉందని, పార్వతీపురం నుంచి ఖడ్గవలస మీదుగా విజయనగరం చేరేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకూ వాహనాలను ఆయా రహదారుల్లోనే ప్రయాణించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.శ్రీను, ఆర్ఐ రాంకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాన్, బైక్ ఢీ..

- పేలిన ఆయిల్ ట్యాంక్
- రెండు వాహనాల దగ్ధం
- ఒకరికి గాయాలు



దగ్ధమైన వ్యాన్

రామభద్రపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రామభద్రపురం బైపాస్ రోడ్డులో శనివా రం అర్ధరాత్రి పెను ప్రమాదం తప్పింది. ద్విచక్రవాహనాన్ని వ్యాన్ ఢీనడంతో ద్విచక్రవాహనం ట్యాంక్ పేలింది. దీంతో మంటలు చెలరేగడంతో వ్యాన్, ద్విచక్రవాహనం దగ్ధమయ్యాయి. ప్రమాదంలో సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. పాచిపెంట మండలంలోని గడివలస గ్రామానికి చెందిన బెవర అప్పలనాయుడు ద్విచక్ర వాహనంపై బాడంగి మండలంలోని రౌతువానివలస అత్తగారింటికి వెళ్తున్నాడు. అదే సమయంలో విజయనగరం నుంచి సాలూరు వైపు గోనెసంచుల లోడుతో వ్యాన్ వెళ్తోంది. ఈ క్రమంలో వ్యాన్ సాలూరు నుంచి రామభద్రపురం వస్తున్న బైకును ఢీకొంది. దీంతో బైక్ వ్యాన్ కింద ఉండిపోయింది. ఆ సమయంలో ద్విచక్రవాహనం ట్యాంకరు పేలిపోవడంతో పెట్రోల్ బయటకు వచ్చి మంటలు చెలరేగాయి. ద్విచక్రవాహనంపై ఉన్న వ్యక్తి తుల్లిపోయి పక్కనపడిపోయాడు. ఎగిసిపడిన మంటలకు వ్యాన్‌తోపాటు, ద్విచక్రవాహనం కాలిబూడిదయ్యాయి. ద్విచక్రవాహన చోదకుడి తల, కాలుపైన గాయాలుకావడంతో 108లో బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వ్యాన్‌లో ఉన్న ఇద్దరు కూడా ప్రమాదం నుంచి బయటపడ్డాడు. సమాచారం అందిన వెంటనే బాడంగి అగ్నిమాపక అధికారి రాంసూర్యారావు ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి వ్యాన్‌లోని గోనెసంచులకు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఆదివారం మధ్యాహ్నం వరకు మంటలు చెలరేగుతున్నాయి. ఎస్ఐ వెలమల ప్రసాదరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేశారు. అయితే ఇంత ఘోర ప్రమాదంలో కూడా ఎవరికి ప్రాణాపాయం లేకపోవడంతో అక్కడ ఉన్నవారంతా ఊపిరిపీల్చుకున్నారు.

గౌరమ్మ సంబరాల్లో కొట్లాట

- ఒకరికి తీవ్ర గాయాలు

మెంటాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మెంటాడ గ్రామంలో శనివారం రాత్రి జరిగిన గౌరమ్మ సంబరంలో ఇద్దరు యువకులు మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. అడ్డొచ్చిన వారిపై విరుచుకు పడ్డారు. ఈ క్రమంలో ఓ యువకుడిని తీవ్రంగా గాయపరిచారు. వివరాల్లోకి వెళితే.. బొండపల్లి మండలం దేవుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు జగదీష్, రామారావు.. మెంటాడ గౌరమ్మ సంబరాలకు వెళ్లారు. అక్కడ మద్యం తాగారు. పిట్టాడ గ్రామానికి చెందిన మండారు సత్యం దంపతులు గౌరమ్మ సంబరాలకు వెళ్లారు. ఈక్రమంలో సత్యం.. నూడిల్స్ షాప్ వద్దకు వెళ్లి, నూడిల్స్ కావాలని యజమానిని అడిగాడు. 'ఇప్పుడు వచ్చి నూడిల్స్ అడుగుతావా. ముందుగా మేమొచ్చాం.. నీకెలా నూడిల్స్ ఇస్తారో చూస్తాం' అంటూ జగదీష్, రామారావు.. సత్యంతో గొడవకు దిగారు. అక్కడున్న వారు వారించినా వినకుండా సత్యంపై రాయితో దాడి చేశారు. సత్యం తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు క్షతగాత్రుడుని గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన యువకులు పరారయ్యేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకుని ఆండ్ర పోలీసులకు అప్పగించారు. గజపతినగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు సత్యం వద్దకు పోలీసులు ఆదివారం వెళ్లి స్టేట్మెంట్ రికార్డు చేశారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఆండ్ర ఎస్ఐ సీతారాం చెప్పారు.

కొట్టక్కిలో పెంకుటిల్లు దగ్ధం

రామభద్రపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టక్కిలో ఆదివారం పెంకుటిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూటే కారణమని భావిస్తున్నారు. బాధితుడు, స్థానికుల కథనం మేరకు.. పెద్దాడ సాయిరాజ్ ఇంటిలో ఫ్రిజ్ పేలిపోవడంతో మంటలు వ్యాపించాయి. దీంతో ఎలక్ట్రికల్ సామగ్రి, బట్టలు, కొంతమేరకు నగదు కాలిపోయాయి. సమాచారం అందుకున్న సాలూరు ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎస్ఐ వెలమల ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కోతి దాడిలో పలువురికి గాయాలు

గంట్యాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ కోతి దాడి చేసిన ఘటనలో పలువురు గాయపడ్డారు. బూడిపేట పరిధిలో ఉన్న కోతి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురిపై గత రెండు రోజులుగా దాడి చేసి, గాయపరిచింది. గంట్యాడ గ్రామానికి చెందిన మోహన్ కార్తీక్, కొటారుబిల్లికి చెందిన హృతిక్‌సాయి, పెదవేమలి గ్రామానికి చెందిన పార్వతి, జగ్గాపురానికి చెందిన నరేష్, లక్కిడాంకు చెందిన నారాయణమూర్తి, నరవ గ్రామానికి చెందిన భాస్కర్, ప్రవళికలను కోతి కరవడంతో వారు స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

తేనెటీగల దాడి..

నెల్లిమర్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక చంపావతి నది వంతెన సమీపంలో ఆదివారం సాయంత్రం తేనెటీగల దాడిలో పలువురు గాయపడ్డారు. వీరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని వైద్య చికిత్స పొందారు. సుమారు 20మందికి గాయాలైనట్టు అంచానా.

డైట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నెల్లిమర్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్‌లో ఖాళీగా ఉన్న మూడు లెక్చరర్ పోస్టుల భర్తీకి అర్హులైన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు డీఈవో యు.మాణిక్యంనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైకాలజీ లెక్చరర్ 1 పోస్టు, ఫైన్ ఆర్ట్స్ లెక్చరర్ 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. వీటిని డెప్యుటేషన్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నామన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు లీప్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి, దరఖాస్తు పత్రాలను తమ కార్యాలయంలో ఈనెల 29వ తేదీలోగా సమర్పించాలని ఆయన సూచించారు. తమకు అందిన దరఖాస్తులను 30, 31 తేదీల్లో పరిశీలిస్తామని, నవంబరు 5 నుంచి 8వ తేదీ వరకు అభ్యర్థులకు రాత పరీక్ష ఉంటుందని, రాత పరీక్ష ఫలితాలు 13న, ఇంటర్వ్యూలు 14, 15 తేదీల్లో ఉంటాయన్నారు. ఎంపికైన వారికి 18న ఉత్తర్వులు జారీ చేస్తామని, ఎంపికైన వారు నవంబరు 19న డైట్‌లో విధుల్లో చేరాల్సి ఉంటుందని డీఈవో తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

చీపురుపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జి.అగ్రహారం శ్మశాన వాటికకు రూ.8 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు టీడీపీ మండల అధ్యక్షుడు రౌతు కామునాయుడు, పట్టణ అధ్యక్షుడు గవిడి నాగరాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత రక్తదాన శిబిరం

గుర్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పాలవలస గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్ యువత ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 35 మంది పాల్గొని, రక్తాన్ని దానం చేశారు. తొలుత నిరుపేద కుటుంబాలకు నగదు, పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు.

మలుపు.. ఆపై గోతులు

- ప్రమాదాల బారిన పడుతున్న వాహనచోదకులు
- ఇదీ ముంజేరు రహదారి దుస్థితి



ప్రమాదకరంగా ఉన్న రహదారి

భోగాపురం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): ముంజేరు సమీప రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలో ప్రమాదకర మలుపుతో పాటు గోతులు ఎక్కువగా ఉన్నాయి. దీంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహన చోదకులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస రావును వివరణ కోరగా.. వచ్చే నెలలో ఈ రహదారికి మరమ్మతులు చేస్తామని చెప్పారు.

తుఫాన్ ముప్పు

(ఐదో పేజీ తరువాయి)

గంటలూ పనిచేయనున్నాయి. ఈ కంట్రోల్ రూంలు తుఫాన్ ప్రభావం, పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారమందించనున్నాయి. మరోవైపు గ్రామాల్లో తుఫాన్ పరిస్థితిపై దండోరా వేయించారు. అవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని, బయటకు రావద్దని ప్రజలను అప్రమత్తం చేశారు. నదిలో చేపల వేటకు వెళ్లరాదని, నదీ మార్గం గుండా ప్రయాణించరాదని సూచించారు. రైతులు తమ పంటలను సంరక్షించుకోవాలని వ్యవసాయశాఖ ప్రత్యేక సూచనలు జారీ చేసింది. తుఫాన్ వల్ల పంట నష్టం ఏర్పడితే సత్వరం తెలుసుకోవాలని తమ శాఖ అధికారులను జిఇల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ ఆదేశించారు.

పలుచోట్ల భారీ వర్షం..

గరుగుబిల్లి/భామిని/వీరఘట్టం/సాలూరు రూరల్: భామిని మండలం గురండి ప్రాంతంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో మొక్కజొన్న, పత్తి రైతులు అవస్థలు పడ్డారు. ఓ వైపు తుఫాన్ హెచ్చరికలు.. మరోవైపు కూలీలు దొరక్క మొక్కజొన్న, పేలిన పత్తిను సేకరించడానికి వారు సాహసించ లేకపోయారు. మండలంలో సుమారు ఏడు వందల ఎకరాల్లో మొక్కజొన్న, వెయ్యి ఎకరాల్లో పత్తి సేకరణకు వాయిదా వేసుకున్నారు. ఇక గరుగుబిల్లి మండలంలో శివ్వాం, దత్తివలస గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురి సింది. మరోవైపు 13 సచివాలయాల పరిధిలోని సిబ్బందిని అధికారులు అప్రమత్తం చేశారు. మండల కేంద్రంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశారు. పర్యవేక్షణకు మండల పరిషత్ సిబ్బందిని నియమించారు. తోటపల్లి పరిధిలోని నాగావళి నదీ తీర ప్రాంతవాసులకు హెచ్చరికలు జారీ చేశారు. వీరఘట్టం పరిధిలో రైతులు వరి పంట కోతలను వాయిదా వేసుకున్నారు. ఇప్పటికే వీచిన ఈదురుగాలుల కారణంగా కంబరవలస, కంబర, చిట్టిపుడివలస తదితర గ్రామాల్లో అరటి నేలవాలింది. మరోవైపు మొక్కజొన్న పిక్కలపై టార్పాలిన్లు కప్పిన రైతులు పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. సాలూరు ఏజెన్సీ ప్రాంతంలోనూ ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం..

తుఫాన్ కారణంగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల వల్ల ఏ సమస్య ఎదురైనా జిల్లా ప్రజలు ఈ 08963 796085 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. వెంటనే సహాయక చర్యలు చేపడతామని వెల్లడించారు. రానున్న మూడు రోజుల పాటు జిల్లా అధికారులు, తహసీల్దార్లు, వీఆర్‌వోలు, సిబ్బంది ప్రధాన కేంద్రాల్లో ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

జిల్లాకు ప్రత్యేకాధికారి నియామకం..

తుఫాన్ నేపథ్యంలో జిల్లాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ఈ మేరకు పార్వతీపురం మన్యానికి ఐఏఎస్ అధికారి నారాయణగుప్తాను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. వర్షాలు, గాలుల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు, ప్రజలకు కలిగే నష్టాలపై ఆయన సమీక్షించి.. సహాయక చర్యల పర్యవేక్షణతోపాటు తగు సూచనలు, సలహాలు అందించనున్నారు.

ఈ-క్రాప్ నమోదుకు గడువు పెంపు

(5వ పేజీ తరువాయి)

సరైన సర్వే నెంబర్లు లేకపోవడం, వెబ్‌ల్యాండ్‌లో పలు సమస్యలు సిబ్బందికి తలనొప్పిగా మారాయి. క్షేత్రస్థాయిలో ఒకలా, రికార్డుల్లో మరొలా ఉండడంతో ఈ క్రాప్ నమోదు ప్రక్రియ జాప్యమవుతోంది. ఈ ఏడాదికి జిల్లాలో రైతులు మొత్తంగా 3.20 లక్షల ఎకరాల్లో పలు రకాల పంటలను సాగు చేస్తున్నారు. అయితే 2.80 లక్షల మేరకే ఈ-క్రాప్ నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం 1,67,843 ఎకరాల వరకే నమోదు ప్రక్రియ పూర్తయింది.

నమోదు చేస్తున్నాం..

'ఈ-క్రాప్ నిబంధనల మార్పుతో నమోదు ప్రక్రియలో కొంతమేర జాప్యం నెలకొంది. రైతు సాగు చేస్తున్న ప్రతి పంటనూ నమోదు చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సమస్యలు నెలకొన్నాయి. అయినప్పటికీ అవకతవకలకు ఆస్కారం లేకుండా నమోదు చేస్తున్నాం. ఈ నెలాఖరుకు పూర్తిస్థాయిలో ఈ-క్రాప్ పూర్తవుతుంది.' అని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్‌పాల్ తెలిపారు.

బిక్కుబిక్కుమని..

(5వ పేజీ తరువాయి)

శిథిలావస్థకు చేరుకోవడంతో డీఎల్‌పీవో సిబ్బంది , డీఎల్‌డీవో కార్యాలయంలోని ఒక రూమ్‌లో తలదాచుకుంటున్నారు. హౌసింగ్ డీఈ కార్యాలయం, కార్మికశాఖ ప్రైవేట్ భవనాల్లోకి మారాయి. గ్రామ కచేరీ, డీపీఆర్‌వో కార్యాలయాలు మూతపడ్డాయి. బీసీ, ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయాలు వేరేచోటకు తరలి వెళ్లాయి. మత్స్యశాఖకు భవనం కోసం అన్వేషిస్తున్నారు. ప్రస్తుతం సమీకృత భవనంలో సచివాలయం, మత్స్యశాఖ, ఆధార్ సేవా కేంద్రాలే ఉన్నాయి. సచివాలయ ఉద్యోగులు కూడా నగర పంచాయతీ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే వారికి భవనం సమకూరకపోవడంతో అక్కడే కాలం వెల్లదీస్తు న్నారు. సచివాలయానికి సంబధించి శ్లాబు పై పెచ్చులు ఊడిపోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుం దోనని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఆధార్ సేవా కేంద్రంలో కంప్యూటర్ ధ్వంసమైంది. ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అక్కడ ఉన్నవారంతా ఊపిరిపీల్చుకున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, ఉద్యోగులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

'మత్స్యశాఖ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఆ భవనంలోకి విధులు నిర్వహించాలంటే భయమేస్తోంది. నూతన భవనం మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికా రులకు నివేదించాం.' అని మత్స్య శాఖ ఉద్యోగి ఎస్.శోభన్‌బాబు తెలిపారు.

అధ్వానంగా వీధి దీపాల నిర్వహణ



ప్రధాన రహదారిలో వెలగని విద్యుత్ దీపాలు

పార్వతీపురం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మునిసిపాలిటీ ప్రధాన రహదారిలో సెంటర్ లైటింగ్ నిర్వహణ మూడు నెలలుగా అధ్వానంగా ఉంది. సాయంత్రం 6 గంటలకు వెలగాల్సిన విద్యుత్ దీపాలు రాత్రి 8 గంటలకు వెలుగుతున్నాయి. 30 వార్డుల్లో అయితే వీధి దీపాలు ఎప్పుడు వెలుగుతాయోచెప్పలేని పరిస్థితి ఉంది. దాదాపు 80 వేల జనాభా కలిగిన మునిసిపాలిటీలో అధికారులు నిర్లక్ష్యం పలు విమర్శలకు తావిస్తోంది. సెంటర్ లైటింగ్, వీధి దీపాల నిర్వహణ బాధ్యతను ఓ ప్రైవేట్ సంస్థ చూస్తోంది. అయితే రెండేళ్లుగా సదరు సంస్థలకు సుమారు రూ.20 లక్షల మేర మునిసిపాలిటీ బకాయి పడినట్టు తెలుస్తోంది. అందుకే విద్యుత్ దీపాల నిర్వహణపై సదరు సంస్థ దృష్టిపెట్టడం లేదని పలువురు అంటున్నారు. ●ఈ విషయమై మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఏఈ సన్యాసిరావును వివరణ కోరగా వీధి, సెంటర్ లైటింగ్ నిర్వహణ సమస్యకు త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. వీధి, సెంటర్ లైటింగ్ బాధ్యతను చూసే ప్రైవేట్ సంస్థకు బకాయిలను వారం, పది రోజుల్లోగా చెలిస్తామన్నారు.

పాలకొండలో ట్రాఫిక్‌జాం

● విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం



రోడ్డుపై నిలిచిన భారీ వాహనం

పాలకొండ, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో ఆదివారం ట్రాఫిక్‌జాం అయింది. ఒడిశాలోని ఓ పరిశ్రమకు సంబంధించిన యంత్ర పరికరం రవాణా చేస్తున్న భారీ వాహనం నిలిచిపోవడంతో సమస్య తలెత్తింది. భారీ కంటైనర్ కారణంగా విద్యుత్ వైర్లతో పాటు కేబుల్ వైర్లు తొలగించాల్సి వచ్చింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పట్టణంలో రాత్రి వరకూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించ లేని దుస్థితి నెలకొంది. భారీ వాహనం పాలకొండలోని గాయత్రీ ఆలయం నుంచి వెలగవాడ వరకు వెళ్లేందుకు సుమారు ఐదు గంటల సమయం పట్టింది. భారీ వాహనాన్ని శ్రీకాకుళం రోడ్డులోని గాయత్రీ ఆలయం నుంచి ఏలాం జంక్షన్ వరకు అక్కడ నుంచి సీతంపేట ప్రధాన రహదారి మీదుగా ఒడిశాకు యంత్ర పరికరాలను తరలించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో శ్రీకాకుళం-పాలకొండ, పాలకొండ-సీతంపేట రహదారి లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సోమవారం ఆ వాహనాన్ని సీతంపేట రోడ్డులోని వెలగవాడ నుంచి సీతంపేట వరకు తరలించనున్నారు.

రహదారి నిబంధనలు పాటించండి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ

పార్వతీపురం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రహదారి నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ఎం.పాపారావు వాహనదారులకు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పాతబస్టాండ్ కూడలి వద్ద ఆటో యూనియన్ సభ్యులతో ట్రాఫిక్ నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తీసుకువెళ్తే రూ. వెయ్యి నుంచి రూ.2 వేలు జరిమానా విధిస్తామన్నారు. ఆటో జరిమానాలకు సంబంధించిన బకాయిలు సకాలంలో చెల్లించకపోతే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఆటోలో నిషేధిత సామగ్రి రవాణా చ చేస్తున్నట్టు గుర్తిస్తే 100, 112, 1972కు ఫోన్ చేసి సమాచారాన్ని అందించాలన్నారు. ఆయనతో పాటు ఏఎస్ఐ పి.శ్రీనివాసరావు ఉన్నారు.

●వీరఘట్టం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రోమోర్ సెంటర్ వద్ద ఆదివారం ఎస్ఐ జి.కళాధర్ వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులతో మాట్లాడుతూ వాహనదారులు విధిగా రహదారి నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు అతికమిస్తే చర్యలు తప్పవన్నారు.

●సీతంపేట రూరల్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన చోదకులు ప్రయాణ సమయంలో తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలని ఎస్ఐ అమ్మనరావు సూచించారు. పీఎంఆర్‌సి జంక్షన్ సమీపంలో ఆదివారం రహదారి భద్రత, హెల్మెట్ ధారణ, సైబర్‌క్రైం అంశాలపై ప్రజలు, వాహనచోదకులు, ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఘాట్ రోడ్డులో సురక్షితమైన ప్రయాణాలు చేయాలన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తన అలవరచుకోవాలి

●కురుపాం, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సత్ప్రవర్తన అలవరచుకోవాలని ఎస్ఐ నారాయణరావు అన్నారు. ఆదివారం గురుకుల విద్యార్థులకు సైబర్ నేరాలు,ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ఆయన అవగాహన కల్పించారు. బాగా చదువకుని ఉన్నత స్థాయికి విద్యార్థులు ఎదగాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో పోస్టు మెట్రిక్ బాలుర వసతి గృహం వార్డెన్ సీహెచ్.సాంబమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

టెట్‌పై రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలి

బొబ్బిలి, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులుగా 2011కి ముందు నియమితులైన వారికి టెట్ నిర్వహించాలన్న అంశానికి సంబంధించి ప్రభుత్వం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని ఏపీ టీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనరు జేసీ రాజు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాలడారు. టెట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. 25 నుంచి 30 ఏళ్ల నుంచి ఉపాధ్యాయవృత్తిలో ఉన్నవారు అప్పట్లో డీఎస్సీ ద్వారా మెరిట్‌పై ఉద్యోగాలు సాధించిన వారేనని పేర్కొన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు చిన్నారావు, యుగంధర్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

గురుకులం ఆధునికీకరణకు ప్రతిపాదనలు

బొబ్బిలి, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని గురుకుల పాఠశాలను ఆధునికీకరించాలని విద్యామంత్రి లోకేశ్‌కు రూ.4.50 కోట్లతో ప్రతిపాదనలు అందజేసినట్లు స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. ఆదివారం బొబ్బిలి గురుకుల పాఠశాలలో పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు యామలాపల్లి జోగినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బేబీనాయన మాట్లాడుతూ గురుకులానికి గేటు, ఓపెన్‌బాత్ ప్లాట్‌ఫామ్స్, పది కంప్యూటర్లు, 25 ఫ్యాన్లు, 60 స్పోర్ట్స్ యూనిఫామ్స్, డైనింగ్ హాల్ ఆధునీకరణ, లైబ్రరీ పుస్తకాలు, సరస్వతీ దేవి విగ్రహానికి పైకప్పు సమకూర్చడం సంతోషదాయకమ న్నారు. ఈ పాఠశాలను దత్తత తీసుకోవడంతో ప్రత్యేక దక్షతతో అభివృద్ధి కోసం కృషి చేస్తాననని, ఇందుకు ఎమ్మెల్సీ గాదె సహాయం తీసుకుంటానని తెలిపారు. గురుకుల ప్రిన్సిపాల్ రఘునాథ్‌తో పాటు పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు కె.రవి చరణ్, బోటు గణేశ్, ఎం.మురళీధర్ పాల్గొన్నారు.

నేటినుంచి బ్రహ్మోత్సవాలు

●సర్వమంగళపీఠం ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తి



శ్రీమేధా దక్షిణామూర్తి విగ్రహం

పార్వతీపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవిద్యా సర్వమంగళపీఠం ప్రాంగణంలోని శ్రీమేధా దక్షిణామూర్తికి సోమవారం నుంచి కార్తీక బ్రహ్మోత్సవాలను నిర్వహించనుట్టు పీఠం వ్యవస్థాపకుడు మురపాక కాళిదాసుశర్మ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. నవంబరు 6న చక్ర తీర్థస్నానంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాలో ప్రప్రథమంగా శ్రీ మేధా దక్షిణామూర్తి కార్తీక బ్రహ్మోత్సవాలను శ్రీవిద్య సర్వమంగళాదేవి పీఠం ప్రాంగణంలో నిర్వహిస్తున్నామన్నారు జిల్లా నలుమూలల నుంచి అయ్యప్పస్వామి భక్తులు, మహిళలు పూజలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

పంట రక్షణకు చర్యలు చేపట్టండి

గరుగుబిల్లి, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి టి.జ్యోత్న్న సూచించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ రైతులు తేలిక రకం వరి పంట కోతలను నిలుపుదల చేయాలన్నారు. గాలులు కారణంగా వరి పంట నేలకొరిగే అవకాశం ఉందన్నారు. దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పంట వర్షం నీటిలో పంట మునిగినట్లయితే 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. కోత కోసిన పంటపై ఉపయోగించాలన్నారు. పొలంలో వర్షపు నీటి నిల్వలను తొలగించాలన్నారు. నీటిని తొలగించిన తదుపరి ఎకరాకు ప్రోపికొనజోల్ 200 మిల్లీ మీటర్లు లేదా హెక్సాకొనజో 400 మిల్లీ మీటర్లను పిచికారీ చేయాలన్నారు. ఆలస్యంగా వేసిన ప్రాంతాల్లో ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ను ఉపయోగించాలన్నారు. పూత దశలో ఉన్న వరి పంటకు గింజ గట్టిపడే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. వర్షాలు కారణంగా ఎంటీయూ-1318, 1262, 1121 రకాలకు గింజ రంగు మారే అవకాశం ఉందని ఆమె వివరించారు.

బిల్లుమడలో గాయత్రీ యజ్ఞం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భామిని, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): గాయత్రీ పరివార్ సంతికుంజో హరిద్వార్ ఆధ్వర్యంలో బిల్లుమడ సమీపంలో గాయత్రీ మహా యజ్ఞం ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలుత సింగిడి నుంచి కలశ శోభ నిర్వహించారు. సోమవారం నుంచి 12 గంటల వరకు గాయత్రీయజ్ఞం, పూర్ణాహుతి, ప్రసాద వితరణ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

గరుగుబిల్లి, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత స్థానిక గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెలవు రోజుల్లో విద్యార్థులకు విజ్ఞానం అందించే పలు అంశాలను వివరిస్తున్నామన్నారు. యువతకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలు అందుమాటులో ఉన్నాయన్నారు.

వనవాసి కల్యాణాశ్రమం సమావేశం



సమావేశంలో పాల్గొన్న పెద్దలు

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం వనవాసి కళ్యాణాశ్రమం సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి కల్యాణ్ ఆశ్రమం జిల్లా అధ్యక్షుడు నాగభూషణం మాస్టారు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లా గిరిజన గ్రామాల్లో 45 వరకు వనభాష కల్యాణాశ్రమం పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. వనవాసి కార్యకర్తలు ఇక్కడ విద్యార్థులకు గిరిజన సంస్కృతి, ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సన్యాసినాయుడు, తహశీల్దార్ శేఖరం, జడ్పీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శొంఠ్యాన రాజేష్, వనవాసి మహిళా ఉపాధ్యక్షులు శ్రీదేవి, బీజేపీ మండల అధ్యక్షుడు అప్పలస్వామి, విశ్రాంత రిటైర్డ్ టీచర్ గుడ్ల హరి తదితరులు పాల్గొన్నారు.

బారసాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు



రామ్మోహన్‌నాయుడు దంపతులతో మంత్రులు, ఎమ్మెల్యేలు

పార్వతీపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఆదివారం నిర్వహించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కుమారుడి బారసాలకు రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు కుమారుడిని వారు ఆశీర్వదించారు.

అప్రమత్తంగా ఉండాలి

భామిని, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్.శివన్నారాయణ సూచిం చారు. ఆదివారం ఆయన రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు తుఫాన్ ప్రభావం ఉంటుందన్నారు. వంశధార నదీతీర ప్రాంతాల ప్రజలు స్నానాలకు వెళ్లరాదన్నారు. దీనిపై ప్రతి గ్రామంలో దండోరా వేయించాలన్నారు. కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అత్యవసరమైతే 8008024290, 9676480615 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

●వీరఘట్టం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అన్ని గ్రామాలో అధికారులందరూఅప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో బి.వెంకటరమణ సూచించారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.

●గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో గిరిజన గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శేఖరం ఓ ప్రకటనలో సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఉండవద్దని గిరిజన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మూడు రోజులు గడ్డలు, వాగులు దగ్గరకు వెళ్లరాదన్నారు. రెవెన్యూ సిబ్బంది అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలన్నారు.

తుఫాన్ రక్షక భవనాల గుర్తింపు

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో గుమ్మలక్ష్మీపురం నాలుగు తుఫాన్ రక్షక భవనాలను ఆదివారం గుర్తించామని తహసీల్దార్ శేఖరం తెలిపారు. దుడ్డుకల్లు కేడీ కాలనీ, కొత్తగూడ, దొరజమ్ము, గిరిజన సం క్షేమ ఆశ్రమ పాఠశాలలను వినియోగిస్తామన్నారు. కొండ చర్యలు విరిగిపడే ప్రమాదం ఉన్న గ్రామాల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సూచించారు.

టీడీపీ నాయకుడు సోంబాబు మృతి



సోంబాబు (ఫైల్)

పాలకొండ, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): లుంబూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రౌతు సోంబాబు ఆదివారం మృతిచెందారు సోంబాబు సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా, నీటి సంఘం అధ్యక్షుడిగా ప్రజలకు సేవలందించారు. సోంబాబు మృతిపై ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి, ఎంపీపీ బొమ్మాళి భాను సుధాకర్, సీపీఐ నాయకుడు బుడితి అప్పలనాయుడు తదితరులు సంతాపం తెలిపారు.

గుండెపోటుతో అధ్యాపకురాలు..



రామలక్ష్మి (ఫైల్)

సీతానగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జోగింపేటలోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలోని లైబ్రరీ అధ్యాపకురాలు కేతిరెడ్డి రామలక్ష్మి (53) శనివారం గుండెపోటుకు గురై మృతి చెందారు. గురుకులంలో విధులు నిర్వహిస్తూ ఆమె కుప్ప కూలిన విషయాన్ని గుర్తించిన గురుకుల విద్యాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ మాణిక్యమ్మ, ప్రిన్సిపాల్ రాజారావు పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించి నప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. రామలక్ష్మి మృతదేహాన్ని స్వగ్రామం బక్కుపేటలో ఆదివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. రామలక్ష్మి మృతి చెందడం దురదృష్టకరమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల జిల్లా కో-ఆర్డినేటర్ మాణిక్యమ్మ అన్నారు. రామలక్ష్మి మృతిపై జిల్లా కో-ఆర్డినేటర్ మాణిక్యమ్మ, ప్రిన్సిపాల్ రాజారావు, సహాయ ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, సహచర అధ్యాపకులు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

భామిని, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): సొలికిరి గ్రామానికి చెందిన బర్ల ఆనంద్‌పై కొత్తకోట గోవిందరావు, ఆయన భార్య, తమ్ముడు దాడి ఆదివారం చేసిన ఘనటపై బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని బత్తిలి ఎస్ఐ అప్పారావు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆనందరావు పలువురికి సాయం చేస్తుండటంతో అది తట్టుకోలేని గోవిందరావు ఇంటికి పిలిపించి దాడి చేశాడన్నారు. దాంతో ఆనందరావు తలకు గాయమైందని ఎస్ఐ తెలిపారు.

నేడు ఐటీడీఏ పీజీఆర్ఎస్ రద్దు

సీతంపేట రూరల్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లాలో భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో సోమవారం సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను (పీజీఆర్ఎస్) రద్దు చేస్తున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గిరిజనులు గమనించాలని సూచించారు.


29న ఉచిత వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఈ నెల 29న ఉచితం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. స్థానిక కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శిబిరానికి రాగోలు జెమ్స్ ఆసుపత్రి వైద్యులు క్యాన్సర్, గుండెవ్యాధులు, కిడ్నీ వ్యాధులను పరీక్షించనున్నారు. ఈ శిబిరాన్ని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ప్రారంభించనున్నారని కళింగ వైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు.

రైల్వే ట్రాక్‌కు ఆనుకుని నిర్మాణం

● భవనం పనులు అడ్డుకున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

బొబ్బిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని రైల్వేట్రాక్‌కు ఆనుకుని నిర్మిస్తున్న భవనం పనులను ఆదివారం మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది అడ్డుకున్నారు. రైల్వేట్రాక్ నుంచి వంద అడుగుల దూరం వరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్ట రాదన్న నిబంధన మేరకు పనులు నిలిపివేయాలని కోరారు. ఆదివారం సెలవు కావడంతో భవనం స్లాబ్ పనులు పూర్తి చేయాలని యజమాని భావించగా, పనుల వివరాలను తెలుసు కొని టౌన్‌ప్లానింగ్ అధికారులు పోలీసుల సహాయంతో అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. కాగా బొబ్బిలి రైల్వేట్రాక్ పక్కన జరు గుతున్న భవనం పనులను గుర్తించి నోటీసులు జారీ చేశామని మునిసిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, టౌన్‌ప్లానింగ్ అధికారి పి.ఫిలిప్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరపకూడదని హెచ్చరిస్తు న్నామని, సచివాలయ సిబ్బంది కూడా వెళ్లి చెబుతున్నారని చెప్పారు. రైల్వే ట్రాక్ సరిహద్దు నుంచి వంద అడుగుల వరకు ఎటువంటి నిర్మాణాలకు అనుమతి లేదని తెలిపా రు. సెలవు దినాలు చూసి పనులకు ఉపక్రమిస్తున్నారని చెప్పారు. అయితే పోలీసుల సహకారంతోవెళ్లి పనులు అడ్డుకున్నామని చెప్పారు. అవసరమైతే అక్రమ భవనాలను కూల్చివేస్తామని, రాజకీయ పరంగా తమపై ఎటువంటి ఒత్తిడి లేదని తెలిపారు.



సాహస క్రీడలో పాల్గొన్న విద్యార్థి

ఎన్టీఆర్ పార్క్‌లో పర్యాటకుల సందడి

సీతంపేట రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. కార్తీకమాసం ప్రారంభం కావడంతో మహిళలు, చిన్నారులు పార్క్‌లో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. పార్క్‌లో పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన షూటింగ్, బోటింగ్, హ్యాంగింగ్ బ్రిడ్జి తదితర సాహసోపేతమైన క్రీడల్లో పాల్గొన్నారు.